ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
మంగళవారం 3 జూన్ 2025





అట్టహాసంగా..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



- వికారాబాద్, మేడ్చల్ కలెక్టరేట్లలో జాతీయ జెండాలను ఎగురవేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి
- పోలీసుల గౌరవ వందనం స్వీకరణ..
- అమరవీరుల స్థూపాల వద్ద నివాళులు
- అమరుల కుటుంబాలకు సన్మానాలు
- అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతాం
- చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



వికారాబాద్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం అంబరాన్నంటాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాలు ఎగురవేశారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లాకు సంబంధించి సందేశాన్ని చదివి వినిపించారు. అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సమగ్రాభివృద్ధే లక్ష్యం

» స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్/మేడ్చల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణను ప్రపంచంలో అగ్ర స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించిందని తెలిపారు.

ఆర్థిక స్వావలంబనకు కృషి

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తి మిషన్ పాలసీ కింద జిల్లాలో ఇప్పటివరకు రూ.20.37 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉచిత ప్రయాణం కింద మహిళలు రూ.3.19 కోట్లు ఆదా

మిగతా 8వ పేజీలో...

స్వయం సహాయక సంఘాలకు రూ.38.37 కోట్ల రుణాలు



వికారాబాద్ జిల్లాలో 464 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా రూ.25.31 కోట్లు, మెప్మా కింద రూ.12.96 కోట్ల విలువైన చెక్కులను స్పీకర్ పంపిణీ చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ గ్రౌండింగ్‌లో తమ లక్ష్యాన్ని సాధించిన రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత సీహెచ్ లక్ష్మికి ఆయన అవార్డు అందజేసి అభినందించారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆవిర్భావ వేడుకల్లో పోతరాజు విన్యాసం

మేడ్చల్ కలెక్టరేట్‌లో జెండా ఎగురవేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి,

సన్మానాలు.. సర్టిఫికెట్ల అందజేత

మేడ్చల్ కలెక్టరేట్‌లో అమరురుల కుటుంబాలను ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. మైనార్టీ శాఖ నుంచి లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేశారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ప్రతిభ చూపిన 17 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు కాంతమ్మ, రామ్మోహన్, చంద్రకళ, విజయకుమారి, గోపాల్, సుగుణబాయి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి



కళాకారులతో స్పీకర్, తదితరులు



మహిళలకు కుట్టు మిషన్ల ప్రొసీడింగ్ అందిస్తున్న ఓబెదుల్లా, తిరుపతిరెడ్డి, అధికారులు

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

» మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్

కొడంగల్/దుద్యాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన మైనార్టీ మహిళలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన 2,100 కుట్టు మిషన్లతోపాటు ఎనిమిది మంది దివ్యాంగులకు స్కూటర్స్ పంపిణీ చేశారు. అలాగే కడా కార్యాలయంలో ఏడీఏ శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో వరి, కంది, జొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులున్నారు.

కొడంగల్ అభివృద్ధికి కృషి

కొడంగల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. దుద్యాల మండలంలోని పోలెపల్లిలో రూ.కోటీ 25 లక్షలతో నిర్మించనున్న పాఠశాల నూతన భవనం, రూ.కోటీ 56 లక్షలతో పోలెపల్లి నుంచి పల్లెగడ్డ మీదుగా సర్జాఖాన్‌పేట్ వరకు బీటీ రోడ్డు, రూ.30 లక్షలతో గ్రామ మహిళా సమాఖ్య భవనం, హకీంపేట్‌లో రూ.2 కోట్ల 40 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో భూ భారతి చట్టం ఆధారంగా దరఖాస్తులకు తక్షణమే పరిష్కారం జరుగుతుందన్నారు. భూ సమస్యలున్న రైతులు గ్రామాల్లో నిర్వహించే సదస్సుల్లో దరఖాస్తులు అందించాలని సూచించారు.

వికారాబాద్‌లో వర్షం



నవాబుపేట మండలం మహ్మదాన్‌పల్లి సమీపంలో కూలిన చెట్టు

వికారాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమైంది. ఒక్క సారిగా వాతావరణం చల్లపడడంతో సాయంత్రం కొద్ది సేపు యడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లపైకి వర్షం నీరు వచ్చి చేరింది. వాహనదారులు, ప్రయాణికులు కొంత ఇబ్బందులు పడ్డారు.

'మన ఊరు-మన బడి' నిధులేవి?

- చేసిన పనులకు డబ్బులు రాక అవస్థలు
- రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్
- మాజీ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్ల ఆవేదన
- కొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా పనులు



బార్వాద్‌లో నిలిచిపోయిన పాఠశాల పనులు

గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు - మన బడి' కింద చేపట్టిన పనులకు బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో మరమ్మతులు, మరికొన్ని పాఠశాలల్లో నూతన గదుల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనకు పనులు ప్రారంభించారు. అప్పులు తెచ్చి పనులు ప్రారంభించినా డబ్బులు సకాలంలో రాకపోవడంతో కొన్ని గ్రామాల్లో పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పనులు పూర్తయిన వాటికి సైతం నిధులు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేకపోతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం గుర్తించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

- కోట్‌పల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

'మన ఊరు - మన బడి' కింద కోట్‌పల్లి మండలంలో మొత్తం తొమ్మిది పాఠశాలల్లో మరమ్మతులు, నూతన భవనాలకు నిధులు మంజూరయ్యాయి. జిల్లా పరిషత్ పాఠశాల మోత్కుపల్లి, ప్రాథమిక పాఠశాల, బార్వాద్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ కోట్‌పల్లి, ప్రాథమిక పాఠశాల, జిన్నారం, ఎన్నారం, పాఠశాలలో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అన్నసాగర్, మల్‌చెట్టిపల్లి తండాలో పనులు పూర్తయ్యాయి. చేసిన పనులకు నిధులు రాక అప్పుల పాలయ్యామని మాజీ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోత్కుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు

మిగతా 8వ పేజీలో...

అప్పు చేసి పనులు చేశాం



'మన ఊరు - మన బడి' కింద చేసిన పనికి డబ్బులు వస్తాయని నమ్మకంతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశాం. చేసిన పనికి తగ్గట్టు ఇప్పటివరకు డబ్బులు రాలేదు. తెచ్చిన అప్పులకు మిత్తులు కట్టలేక అప్పుల పాలవుతున్నాం. సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించాలి.

- పాండురంగారెడ్డి మాజీ సర్పంచ్, మోత్కుపల్లి గ్రామం

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి(2025-26) ఐటీఐలో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని శామిర్‌పేట పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ) కళాశాల ప్రిన్స్‌పాల్ లలిత సోమవారం ప్రకటనలో కోరారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కంప్యూటర్ ఆపరేటింగ్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా) తదితర ట్రేడుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి వివరాలు పదో తరగతి మార్కుల మెమోలో, ఆధార్ కార్డులో ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్య సంవత్సరం పూర్తయ్యేంత వరకు దరఖాస్తులో నమోదు చేసిన ఫోన్ నంబర్‌నే వినియోగించాలని స్పష్టం చేశారు.



మూన్నెళ్లది ఒకేసారి..

ఒకేసారి మూడు నెలల సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. ఒక వ్యక్తి ఆరుసార్లు తంబు వేయాల్సి వస్తుంది. ఒక కార్డుకు ఆరుసార్లు బియ్యం తూకం వేయాల్సి వస్తున్నది. ఘట్‌కేసర్ మండలంలో 28 రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా 1,250 టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేస్తారు. అయితే ఈ నెలలో మూడు నెలల కోటా 3,750 టన్నులకు పైగా బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఒక్కో కార్డుదారుడికి 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతుండటంతో గంటకు 5 నుంచి ఆరుగురికే బియ్యం ఇవ్వగలుగుతున్నారు. దీంతో రేషన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరుతున్నారు.

ఘట్‌కేసర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్/దుద్యాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం బొంరాస్‌పేట్‌లో ప్రభుత్వం ద్వారా వచ్చిన సబ్సిడీ విత్తనాలతోపాటు డ్రిప్పు పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని ఒక్కో పంచాయతీలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బొంరాస్‌పేట్ తహసీల్దార్ పద్మావతి ఉత్తమ అధికారిగా ప్రశంసపత్రం అందుకోవడంతో ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పోలప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, కృష్ణ, నర్సిములుయాదవ్, ఏఈఓలు స్వాతి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌నేషన్- వన్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించాలి
పార్టీలకు అతీతంగా మద్దతు తెలపాలి
చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
7

100డేస్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం
తాండూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
6

ఆక్రమణల కూల్చివేతలపై రగడ
ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ అధికారుల తీరుపై మండిపాటు
7

కళతప్పిన ఆవిర్భావ వేడుకలు!

ధారూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలను అధికారులు నామ్‌కేవాస్తేగా నిర్వహించడంపై కొంతమంది అధికార పార్టీ నాయకులు రుసరుసలాడారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాల్సి ఉండగా అధికారులు మొక్కుబడిగా మామ అనిపించటంతో కార్యక్రమం చప్పగా సాగిందని వారు అసంతృప్తి వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల ప్రజలు, నాయకులు వెళ్లే వరకూ జాతీయ జెండాను సిద్ధం చేయకపోవడం, వీరు అక్కడికి వెళ్లిన తర్వాతే తాపీగా జెండాను సిద్ధం చేసి ఎగురవేశారని, కార్యాలయాలను ముస్తాబు చేయలేదని పార్టీ నాయకులు తప్పుబట్టారు. కొన్నిచోట్ల తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' పాటను తాము చెబితేనే ప్లే చేశారని చర్చించుకుంటున్నారు. పరిపాలన తమ చేతుల్లో ఉందని అధికారులు వేడుకలను మమ అనిపించి చేతులు దులుపుకున్నారని, ఆవిర్భావ వేడుకలు కళ తప్పాయని కాంగ్రెస్ నాయకులు అసహనం వ్యక్తంచేశారు.

100డేస్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం



ఇందిరా చౌక్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు

తాండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'ఒక మార్పు-అభివృద్ధికి మలుపు-స్వచ్ఛతపై తొలి అడుగు' అనే నినాదంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (సీడీఎంఏ) డైరెక్టర్ శ్రీదేవి ఆదేశాల మేరకు 100డేస్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టారు. తాండూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోమవారం 100డేస్ ప్రోగ్రామ్ లోగోను ఆవిష్కరించి జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. అధికారులు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, జవాన్లు, ఆర్పీలు, కార్మికులు కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి లారీపార్కింగ్, పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి ఇందిరాచౌక్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ధారాసింగ్, విజయలక్ష్మి రత్నమాల, విక్రం సింహారెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట్: ప్రభుత్వం చేపట్టిన 100రోజుల కార్యాచరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తూంకుంటలోని రాజీవ్ రహదారిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త, ఎంపీవో వినూత్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అవతరణ వేడుకలు

వికారాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 11వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ ప్రతీక్ జైన్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కోర్టులో జిల్లా న్యాయాధికారి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయంలో వాసుచంద్ర, ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ హన్మంత్‌రావు, గ్రంథాలయ ఆవరణలో చైర్మన్ రాజేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, గాంధీ పార్కులో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనారాయణ, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జాతీయ జెండాలను ఆవిష్కరించగా, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి సంబురాలు నిర్వహించుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు ఆయా పార్టీల నాయకులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.



జాతీయజెండా ఎగురవేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు ఎస్పీ హన్మంతు

వేడుకల్లో పాత తెలంగాణ తల్లి ఫొటో

బషీరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని బషీరాబాద్ మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అయితే పలు చోట్ల గత ప్రభుత్వ హయాంలోని తెలంగాణ తల్లి ఫొటో పెట్టి వేడుకలను జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నూతన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నూతన తెలంగాణ తల్లి ఫొటోను వేడుకల్లో ఆవిష్కరించాల్సి ఉండగా పలుచోట్ల పాత తెలంగాణ తల్లి ఫొటోతో ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చర్చనీయాంశమైంది. తెలంగాణ తల్లి నూతన ఫొటోను సిద్ధం చేసుకోకపోవడంపై కాంగ్రెస్ నేతలు పలువురు మండిపడుతున్నారు.

అభివృద్ధిలో రాష్ట్రం ముందడుగు

చేవెళ్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం చేవెళ్లలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం అభ్యుదయ రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన విత్తనాలను పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌బాబు, ఏవో శంకర్‌లాల్, తహసీల్దార్ కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ మహాయజ్ఞం

ఆమనగల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని నిత్య శుద్ధానంద స్వామి క్షేత్రం, శ్రీరామ దూత ఆశ్రమంలో సోమవారం 130వ విష్ణు సహస్రనామ మహాయజ్ఞం, శుద్ధానందస్వామి చతుర్థ పుణ్యారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు తరలివచ్చారు.సాయంత్రం వరకు యజ్ఞపూజలు కొనసాగాయి. సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరు దైవచింతనతో మెలగాలని స్వామీజీలు సూచించారు. కార్యక్రమంలో నటరాజ్ యాదయ్య, వెంకటయ్య, యుగందర్‌రెడ్డి, అర్థం లక్ష్మయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.



మహా యజ్ఞంలో మాట్లాడుతున్న స్వాములు

ఉత్తమ సేవలకు అవార్డులు

కులకచర/యాలాల/తాండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో కులకచర్ల అధికారికి ఉత్తమ అవార్డు లభించింది. పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో భాస్కర్‌గౌడ్ జిల్లా స్థాయి ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో సోమవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. అలాగే యాలాల మండల ఎంపీవో యాదయ్య ఉత్తమ సేవా ఉద్యోగిగా , దుద్యాలతహసీల్దార్ కిషన్‌నాయక్, డీటీ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తాండూరు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తాండూరు పోలీస్‌స్టేషన్‌తో పాటు కొడంగల్, వివిధ పోలీస్‌స్టేషన్లలో క్రైం బ్రాంచ్‌లో చేసిన సేవలకు గానూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.



భాస్కర్‌గౌడ్ యాదయ్య కిషన్‌నాయక్ మహిపాల్‌రెడ్డి

ఆక్రమణల కూల్చివేతలపై రగడ

ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ

బల్దియా అధికారుల తీరుపై మండిపాటు



తాండూరులో ఆక్రమణల కూల్చివేత (ఫైల్)

తాండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో అధికారులు ఆక్రమణలను కూల్చివేతలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. అధికార పార్టీ నాయకులు ఈ పంచాయితీని ఎమ్మెల్యే వద్దకు చేర్చారు. మరోవైపు కూల్చివేతలపై బల్దియా అధికారులు ద్వంద వైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతనెల 31న ప్రారంభమైన కూల్చివేతలు శనివారం వరకు జరిగాయి. పెద్దలకు ఒక న్యాయం పేదలకు మరొక న్యాయమంటూ అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు మండిపడుతున్నారు. తాండూరు ఇందిరాచౌక్ నుంచి బస్టాండ్ వరకు ఇరువైపులా కూల్చివేతలు ముందుగా ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి మురుగు కాల్వపై ఉన్న అక్రమణలను, పైన ఉన్న చిన్నపాటి షెడ్‌లను తొలగించారు. ట్రాఫిక్ అంతరాయం పేరిట చేపడుతున్నఈకూల్చివేతల్లో కొన్నింటికి మినహాయింపు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నలు కురిపిస్తున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించి ఎందుకు ఆపేశారని పట్టణం మొత్తం చేపట్టాలని ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు శనివారం రాత్రి ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ రవూఫ్ ఫోన్‌లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పేదల పొట్ట కొడతారా? అంటూ మున్సిపల్ అధికారుల తీరుపై అధికార పార్టీ నేత ఒకరు ప్రశ్నించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ ఆసిఫ్ ఓ వీడియోను విడుదల చేస్తూ అక్రమంగా పార్కును కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న స్థలాన్ని వదిలేసి బల్దియా అధికారులు పేదల వెంట పడ్డారని ఆరోపించారు. మున్సిపాలిటీ అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించకపోతే సీడీఎంఏకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేదలకు అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. అది, సోమవారాలు కూల్చివేతలు నిలిపివేయగా ప్రస్తుతం తాండూరులో ఈ కూల్చివేతల వ్యవహారం చర్చనీయాంశమైంది.



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వన్‌నేషన్ - వన్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించాలి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిగి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ కార్యకర్తలకు సూచించారు. పరిగిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఫంక్షన్‌హాల్‌లో వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌పై సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎప్పుడు, ఏదో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయని, దీనివల్ల నిబంధనలు అభివృద్ధికి ఆటంకం కల్గిస్తున్నాయని తెలిపారు. వన్‌నేషన్, వన్ ఎలక్షన్ విధానానికి అన్ని రాజకీయ పార్టీల మద్దతు అవసరమన్నారు. ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు, అభివృద్ధికి ఆటంకం లేకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి జనార్ధన్‌గౌడ్, కన్వీనర్ రాంచందర్, కో-కన్వీనర్ రమేశ్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, మారుతికిరణ్, గిరమోని శ్రీనివాస్, తాండూరు రమేశ్, బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, జూన్2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం కార్యక్రమంలో పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా హౌసింగ్ అధికారి కృష్ణ, ఎంపీడీవో గమ్యా, ఏవో ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, అయుబ్, రవికాంత్, నాయకులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపు సంతోషకరం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీలు

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపునకు ప్రభుత్వ ఉత్తర్వుల జారీ శుభపరిణామమని మాజీ వైస్ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ఆయకుడు అఫ్జల్‌బేగ్ అన్నారు. సోమవారం నేదునూరులో అంగన్‌వాడీలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ వయసును 65ఏళ్లకు, బెనిఫిట్స్ రూ.2లక్షలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారతమ్మ, సుమతి, యశోద, అనిత, ఆశావర్కర్లు సురేఖ, ఆయాలు, నాయకులు బాలయ్య, సంజీవరెడ్డి, మంజుల, బాబు, బి.సురేష్, వి.రాములు, శంకర్, మహేస్, పాండు పాల్గొన్నారు.

ఫీజులో రాయితీ ఇవ్వాలని జర్నలిస్టుల వినతి

రంగారెడ్డి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని కోరుతూ సోమవారం టీడబ్ల్యూజేఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయులు కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో 50శాతం ఫీజు రాయితీ ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థ 50శాతం ఫీజురాయితీ అమలయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. దీనిపై ప్రైవేట్ విద్యా సంస్థలకు సర్క్యులర్ జారీ చేస్తామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీకి చొరవ తీసుకుంటా మని భరోసా ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసినవారిలో టీడబ్ల్యూజేఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు, టీడబ్ల్యూజేఫ్ రంగారెడ్డి కమిటీ, జర్నలిస్టులు వి.శ్రీనివాసచారి, సురేష్, రఘుపతి, శ్రీశైలం, గణేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రజాపాలనలో అందరికీ న్యాయం



ఆమనగల్లులో కాంగ్రెస్ నేతల సంబురాలు

ఆమనగల్లు/కడ్తాల్, జూన్2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన ఘనత ఏఐసీసీ నేత సోనియాగాంధీకే దక్కిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగాలన్నదే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ఆమనగల్లు, కడ్తాలల్లో సోమవారం బ్లాక్, మండల కాగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, జగన్, మానయ్య, బీచ్యానాయక్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, సోనియాగాంధీకి కృతజ్ఞత వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అమరుల కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, చందోజీ, జహంగీర్‌అలీ, జగన్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ధనుంజయ, కృష్ణానాయక్, పాండు రంగయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, మండ్లి రాములు, మైసయ్య, బాబ, పరమేశ్, ఖాదర్, ఫరీద్, చేగూరి వెంకటేశ్, జహంగీర్‌బాబా, శ్రీను, హీరాసింగ్, రవి, రాజేశ్, యాదయ్య, అస్గర్ అలీ, బిక్య, రాంచందర్, జవహర్‌లాల్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు సింహాద్రినాయుడు ఎంపిక



షాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అభ్యసన పద్ధతులపై(బెస్ట్ ప్రాక్టీస్) నిర్వహించే ప్రదర్శనకు షాబాద్ మండలం వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింహాద్రినాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ సోమవారం తెలిపారు. అన్ని జిల్లాల్లో ఉత్తమ అభ్యసన ప్రక్రియ ప్రదర్శన చేసిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. షాబాద్ మండలం వెంకమ్మగూడ పాఠశాల హెచ్‌ఎం ఎంపికయ్యారని తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



ఇబ్రహీంపట్నంలో బడిబాట ప్రచార జాత



కొత్తూర్: బడిబాటలో పాల్గొన్న ఎంఈవో అంగోర్‌నాయక్

ఇబ్రహీంపట్నం/కొత్తూర్/కడ్తాల్, జూన్2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. నాగన్‌పల్లి, పోల్కంపల్లి, ఏన్గల్‌గూడ, రాయపోల్ టీచర్లు ఇల్లిల్లూ తిరిగి ప్రభుత్వ బడులపై ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని టీయూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాములయ్య అన్నారు. ఇంగ్లీష్ మీడియంలోనూ బోధన సాగుతోందన్నారు. కార్యక్రమంలో టీచర్లు జగన్నాథ్‌శర్మ, మల్లేష్, రామకృష్ణ, సుగంధ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కొత్తూర్ ఎంఈవో అంగోర్‌నాయక్ అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొత్తూర్‌లో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు ఉంటాయన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాగిజావ అందించడం జరుగుతుందన్నారు. ఫీజుల భారం లేకుండా ఉచితంగా విద్యను పొందవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కాపాడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపైన ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రఘుపాల్, ప్రచార జాత అధ్యక్షుడు సాయన్న, ఉపాధ్యక్షుడు ప్రిన్స్ టీఎస్‌టీయూఎఫ్ నాయకుడు రాజ్‌కుమార్, శ్రీనివాస్, గౌరయ్య, పెంజర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మీ, ఉపాధ్యాయులు ఫాతిమా, సునంద, అన్నపూర్ణ, భగవంతు, శ్రీనివాస్, రవికుమార్, రాజు, బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన టీచర్లతో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.గోపాల్‌నాయక్ అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, జిల్లా కార్యదర్శి శంకర్‌లతో కలిసి బడిబాట ర్యాలీ, ప్రచారజాతాను ప్రారంభించారు. ప్రభుత్వ స్కూళ్లలో పాఠ్య, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌లు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, టీచర్లు మల్లయ్య, కౌసల్య, విజయ్‌కుమార్, నాయకులు జగన్, నర్సింహమూర్తి, భాగ్యలక్ష్మి, నాగరత్నం పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ధారూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం ధారూరు రైతు వేదికలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ బాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్‌లు రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, ఏఈవోలు సంజూరాథోడ్, సంతోష్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు..

ధారూరులోని మండల వనరుల కేంద్రంలో పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింహులుతో కలిసి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం

» ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, జూన్ 2, (ఆంధ్రజ్యోతి) : తాండూరు నియోజకవర్గంలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు అందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. సంగెంకలాన్‌లో సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేశారు. గ్రామాల్లో మురుగు నీటి కాల్వలను నూతనంగా నిర్మించేందుకు రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు వెచ్చించి నిర్మాణం చేపడుతున్నామన్నారు. తాండూరు ఆర్టీసీ డిపోలో మెరుగైన రవాణా కోసం కొత్తగా 55 బస్సులను అందజేశారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఉత్తంచంద్, జెర్నె నాగప్ప, శరణు బసప్ప, వడ్డె శ్రీనివాస్, కరీముద్దీన్, ఎంఏ రహీం పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు

యువతలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే బీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. మండలంలోని చెంగోల్ గ్రామ శివారులో సోమవారం కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్ ఆధ్వర్యంలో 18రోజులపాటు బీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో తాండూరు మండలం గుంతబాస్పల్లికి చెందిన యువత జట్టు, పెద్దేముల్ మండలానికి చెందిన జట్టు పోటీపడగా, పెద్దేముల్ జట్టు గెలుపొందింది. విన్నర్ జట్టుకు మొదటి బహుమతి రూ.30వేలు, రన్నర్ జట్టుకు రెండో బహుమతి రూ.15వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా గౌడి శేఖర్, బెస్ట్ బౌలర్‌గా అంజీలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఉత్తంచంద్, రాము యాదవ్, జెర్నె నాగప్ప, వడ్డె శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మర్పల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్లూర్ గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు రాములుయాదవ్, సురేశ్, రామేశ్వర్ పాల్గొన్నారు.

అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

యాచారం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్య చేసుకున్న దొడ్డి అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చింతపట్లకు వచ్చి అశోక్ భార్యాపిల్లలను ఓదార్చి ఆర్థిక సాయమందించారు. బాధిత కుటుంబానికి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అంజయ్యను పరామర్శించారు. మాజీ ఎంపీ వెంట బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, నాయకులు తాండ్ర రవీందర్, రమేశ్, జంగయ్యగౌడ్, రాయకంటి విజయ్‌కుమార్, కె.పురుషోత్తమ్ ఉన్నారు.

గురుకులాల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో సోమవారం మాట్లాడుతూ.. 'గురుకులాల్లో పిల్లలు చప్పట్లు కొట్టగానే టేబుల్‌పైకి భోజనం వస్తుందా? వాళ్ల పనులు వారే చేసుకోవాలి.' అని మాట్లాడిన ఆమెపై ప్రభుత్వం తీసుకోవాలన్నారు. తల్లి స్థానంలో ఉండి పిల్లలపట్ల ఇటాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇకనైనా అధికారులు అవహేళన మాటలను మానుకోవాలని హితవు పలికారు.

11 ఏళ్లైనా న్యాయం జరగలేదు

» వీడీడీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

వికారాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు కావస్తున్నా వికారాబాద్ ప్రాంతానికి నీళ్లు, నిధులు, నియామకాల్లో న్యాయం జరగలేదని వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు, జిల్లా టీజేఏసీ మాజీ చైర్మన్ కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ. వికారాబాద్ జిల్లా అభివృద్ధి కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎన్.శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఎమ్.సురేష్, ఎన్.దేవదాస్, మారుతి, మాణిక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి, టి.శంకర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ సమకూరుస్తాం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ గ్రంథాలయంలో విద్యార్థులకు కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన పుస్తకాలను సమకూరుస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి బృందం సమకూర్చిన పుస్తకాలను చూసి ఎమ్మెల్యే అభినందించారు. మరిన్ని పుస్తకాలు తీసుకురావాలని 20వేల రూపాయలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే కేశంపేట రోడ్డులో వచ్చే ఏడాదిలోపు కాంగ్రెస్ పార్టీ భవనాన్ని నిర్మిస్తామని శంకర్ తెలిపారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భవన నిర్మాణ మెటీరియల్‌ను తాను అందజేస్తానని, పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగ్గనూరి విశ్వం, బాబర్‌ఖాన్, పి.వెంకట్‌రాంరెడ్డి, చెన్నయ్య, బస్వంలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. అలాగే వరి, జొన్న విత్తనాలను సోమవారం ఎమ్మెల్యే శంకర్ రైతులకు అందజేశారు. ఇన్చార్జి ఏడీఏ నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో విత్తనాలను పంపిణీ చేశారు. నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరు మండలాల రైతులకు వరి, జొన్న విత్తనాల ఉత్పత్తి చేసి రైతులకు విక్రయించేందుకు 305మంది రైతులకు 10కిలో చొప్పున కూనారం సన్నాల వరి విత్తనాలను, 56మంది జొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అవతరణ వేడుకలో గాంధీ ఫొటో పెట్టలేదని ఎమ్మెల్యే ఆగ్రహం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలో అధికారుల తీరు బాగాలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే కాన్వాయ్‌కి పోలీసు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేయలేదు. అలాగే ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ వద్ద నిర్వహించి జెండా విష్కరణలో తెలంగాణతల్లి, జయశంకర్‌ల ఫొటోలు పెట్టి మహాత్మాగాంధీ ఫొటో పెట్టలేదు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు నాగిళ్ల గోపాల్‌గుప్తా ఎంపీడీవో బన్సీలాల్‌ను నిలదీశారు. నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే కల్పించుకొని.. 'మీరు గాంధీ ఫొటో పెట్టరు, ఎస్కార్టునూ పంపరు. ఇదేం నిర్లక్ష్యం?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారులకు స్వేచ్ఛ ఇస్తే నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. అలాగే ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదంపై ఎమ్మెల్యే కోపగించుకున్నారు. ఆర్డీఓ ఆఫీసు వద్ద ఉద్యమకారులను, జర్నలిస్టులను ఎమ్మెల్యే సత్కరించారు. ఉద్యమకారుల జాబితాను మాజీ జెడ్పీటీసీ, ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి సిద్ధం చేశారు. టీఆర్ఎస్‌లో పనిచేసిన వారే ఉద్యమకారులా? ఇతర పార్టీల్లోని వారు పాల్గొనలేదా? అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాల్‌రాజ్‌గౌడ్ ప్రశ్నించారు. సకల జనులు, అన్ని పార్టీలు ఉద్యమిస్తేనే స్వరాష్ట్రం వచ్చిందని అన్నారు. ఆస్తులను అమ్ముకొని తాము ఉద్యమం చేసినాడు ఎవరూ రాలేదని వెంకట్‌రాంరెడ్డి బదులిచ్చారు. అయితే వాగ్వాదానికి ఇది సమయం, సందర్భం కాదని ఎమ్మెల్యే, ఇతర కాంగ్రెస్ నాయకులు వారిని శాంతపర్చారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

మొయినాబాద్ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో మనశ్శాంతి కోసం ప్రతీ వ్యక్తి దైవచింతనను అలవార్చుకోవాలని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్ అన్నారు. వెంకటపూర్‌లో మహేందర్‌రెడ్డి సొంత డబ్బులతో నిర్మించిన పోచమ్మ ఆలయ పునఃనిర్మాణ వేడుకలో సోమవారం ఆయన పాల్గొన్ని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయాల్లోనే మనశ్శాంతి లభిస్తుందన్నారు. ఒత్తిడి తగ్గించుకునేందుకు ప్రతీ వ్యక్తి దైవ చింతనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మణయ్య, నాయకులు బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టెక్నాలజీ రంగంలో మరింత పరిశోధన జరగాలి



మాట్లాడుతున్న వైజ్‌వర్క్ సీఈవో మదన్‌కుమార్ శ్రీనివాసన్

ఇబ్రహీంపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులొస్తున్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని పరిశోధనల దిశగా కృషిచేయాలని వైజ్‌వర్క్ సీఈవో డాక్టర్ మదన్‌కుమార్ శ్రీనివాసన్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) సహకారంతో సోమవారం 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీస్-2025' పేరిట సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టెక్నాలజీలో భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోదని, విదేశీ విద్యార్థులు ఉన్నత చదువులకోసం మన దేశానికి వస్తున్నారన్నారు. దేశ నలుమూలల నుంచి పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, పీజీ, పరిశోధన విద్యార్థులు పాల్గొని విశ్లేషణలు చేశారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్‌చైన్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ తదితర రంగాల్లో 180కిపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. సదస్సులో సీఎస్ఐ నేషనల్ కార్యదర్శి రాజు ఎల్.కంచిబొట్ల, సీజీఐ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ రీనా ఎస్.శుక్లా, కోహ్లీ, వైస్ చాన్స్‌లర్ డా.సైనీ, డైరెక్టర్లు ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, సంజీవ్ శ్రీవాస్తవ, జేడీ పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్లు హరీష్ కుంద్రా, రిషీసాయల్, ప్రిన్సిపాల్ వెంకట్రావు పాల్గొన్నారు.

తాండూరు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి





పరిగి: క్యాంపు కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మేడ్చల్‌టౌన్: కేఎల్లార్ నగర్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి





శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించిన కమిషనర్ వెంకటగోపాల్

తాండూరు: వీవీహెచ్‌ఎస్‌లో జెండా ఆవిష్కరణలో రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయ కర్త కరుణం పురుషోత్తంరావు



ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతం, తెలంగాణ గీతం ఆలపించారు. రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమకారులు, తెలంగాణ అభిమానులు అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కీసర: అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న రాజకీయ పార్టీల శ్రేణులు



పరిగి: జెండాను ఆవిష్కరిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి



కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జెండావిష్కరణలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, నాయకులు



ఘట్‌కేసర్: మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కమిషనర్ భాస్కర్‌రెడ్డి



పూడూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేస్తున్న డీపీవో జయసుధ



ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో జెండా వందనం చేస్తున్నన పోలీసులు, నాయకులు



కీసర రూరల్: నాగారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ భాస్కర్‌రెడ్డి, తదితరులు

ధారూరు: తహసీల్దార్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ సాజిదా బేగం





పెద్దేముల్: జెండాను ఎగురవేస్తున్న మండల ప్రత్యేకాధికారి



దోమ: తహసీల్దార్ కార్యాలయం ముందు జాతీయ జెండా ఆవిష్కరణలో తహసీల్దార్ గోవిందమ్మ



దుద్యాల: మండల విద్యావనరుల కేంద్రంలో తెలంగాణ అవతరణ వేడుకల్లో ఉపాధ్యాయులు



బొంరాస్‌పేట్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది



మూడుచింతలపల్లి: జెండావిష్కరణలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి



యాలాల: బీజేపీ పార్టీ కార్యాలయం ఎదుట జెండావిష్కరణలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా



మర్పల్లి: తహసీల్దార్ కార్యాలయం ముందు జాతీయ జెండా ఆవిష్కరణలో తహసీల్దార్ పురుషోత్తం



పరిగి: తహసీల్దార్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌రావు



తాండూరు రూరల్: జెండావిష్కరణలో తహసీల్దార్ తారాసింగ్



కులకచర్ల: తహసీల్దార్ కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ప్రత్యేకాధికారి విద్యాధర్



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు జిల్లా ఉపాధ్యాయుల ఎంపిక

పూడూరు, జూన్ 2, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధి వివిధ అభ్యసన పద్ధతులు నిర్వహించే ఉత్తమ ప్రదర్శనకు వికారాబాద్ జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. పూడూరు మండలం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.ఈశ్వర్‌రావు, ధారూర్ మండలం నాగసముందర్ పాఠశాలకు చెందిన ఎం.సరిత, మోమిన్‌పేట్ మండలం ఎన్కెతాలకు చెందిన ఉపాధ్యాయుడు డి.రమేష్ లు ఎంపికైనట్లు డీఈవో రేణుకాదేవి తెలిపారు. వికారాబాద్ జిల్లా స్థాయిలో 30మంది ప్రదర్శనలో పాల్గొనగా, కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీ ముగ్గురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసిందని డీఈవో తెలిపారు.

పరేడ్ గ్రౌండ్‌లో తాండూరు విద్యార్థుల ప్రదర్శన

తాండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన ఉత్సవాల్లో తాండూరు విద్యార్థులు నృత్య ప్రదర్శనతో అలరించారు. సింగిడి సంస్కృతిక సంస్థ, ఎస్‌ఎస్ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో నాట్య గురువు రమేష్ సారథ్యంలో నృత్యాన్ని ప్రదర్శించాడు. ఈ ప్రదర్శనలో మాస్టర్ రమేష్‌తో పాటు మధు, అశోక్, అరవింద్, నందు, అంకిత, శృతి, అనూషలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రొసీడింగ్స్

శామీర్‌పేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని నిలదొక్కుకునేందుకు కృషి చేయాలని మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు.మున్సిపల్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రొసీడింగ్స్ పత్రాలను సోమవారం అందజేసారు. అలియాబాద్ మున్సిపల్ వ్యాప్తంగా మొత్తం 130మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లబ్దిదారులు ఎంపికయ్యారని ఎంపీడీవో మమతాభాయి తెలిపారు.

నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

కులకచర్ల: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను తొందరగా పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి సోమవారం మండల పరిధిలోని చెరువు ముందలి తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. మండలానికి 391 ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే అక్రమ కేసులు

దోమ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మైనింగ్ పేరుతో అక్రమ కేసులు పెట్టారని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అమ్మకానికి పెట్టిన ఇద్దరు రెడ్డి లీడర్లు ఎమ్మెల్యే వెంబడే ఉన్నారని, వారిని ముందు అరెస్టు చేయాలన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు అక్రమ కేసులతో ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చూయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మల్లేశం, ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు అవకాశం

మేడ్చల్‌టౌన్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కోర్సుల్లో అడ్మిషన్ల కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎం. హనుమాన్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 21 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అట్టహాసంగా..

(ఐదో పేజీ తరువాయి)

చేసుకున్నారని, మహాలక్ష్మి పథకం కింద గృహిణులకు రూ.500లకే వంట గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా జిల్లాలో 1,603 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందినట్లు చెప్పారు. భూ వివాదాలు లేని తెలంగాణే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, మంగళవారం నుంచి అన్ని మండలాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చి జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అదనపు ఎస్పీ హనుమంతరావు, ఆర్డీవో వాసుచంద్ర, ఆర్డీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తదితరులు



168 మందికి ప్రశంసాపత్రాలు

జిల్లాలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖలకు చెందిన 168 మంది అధికారులు, ఉద్యోగులు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిలో ఆర్డీవో వాసుచంద్ర, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీపీవో జయసుధ, డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీటీవో వెంకట్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరవణ, డీటీపీవో వేణుగోపాల్, కొడంగల్ మునిసిపల్ కమిషనర్ బలరాంనాయక్ తదితరులు ఉన్నారు.

'అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతాం'

తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అందరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కీసరలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించి కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్, డీసీపీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 12వ వసంతంలోకి అడుగిడుతున్నామని, ఎంతో మంది త్యాగాల ఫలితమే తెలంగాణ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యమిస్తూ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా అభివృద్ధిలో తమవంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

'మన ఊరు - మన బడి' నిధులేవి?

(ఐదో పేజీ తరువాయి)

రూ.13 లక్షలకు గాను 3.30 లక్షలు మాత్రమే బిల్లులు చేశారని, ఇంకా రూ.6.50 లక్షలతో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యుత్, ఫ్లోరింగ్ బండలు, గేటు, ఇలా పూర్తి చేసిన పనులకు ఎన్ని నిధులు కేటాయించారో తెలియదని మాజీ సర్పంచ్ పేర్కొన్నారు. పనులు పూర్తి చేసి రెండేళ్లు గడుస్తున్నా నిధులు రాక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. బార్వాద్ గ్రామంలో గదులు శిథిలావస్థలో ఉండడంతో నూతనంగా నిర్మించేందుకు మూడు గదులను తొలగించి మన ఊరు - మన బడి కింద రూ.40 లక్షలతో గ్రామస్తులు కాంట్రాక్ట్ తీసుకుని దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేసి పనులు చేశారు. చేసిన డబ్బులు రాక పనులు పూర్తి చేయలేక మధ్యలోనే ఆగిపోయాయి. జిన్నారం పాఠశాలలో నూతన భవనం కోసం రూ.11.52 లక్షల నిధులకు దాదాపు రూ.7 లక్షల వరకు పనులు పూర్తి చేశారు. చేసిన పనులకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి డబ్బులు రాలేదు.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం



'మన ఊరు - మన బడి' కింద చేసిన పనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నేరుగా అకౌంట్‌లోకి డబ్బులు జమవుతాయి. **- చంద్రప్ప, మండల విద్యాధికారి**

నమ్మి మోసపోయాం



చేసిన పనికి డబ్బులు వస్తాయని అప్పటి ప్రభుత్వం చెప్పడంతో నమ్మి మోసపోయిన. పాత స్కూల్ భవనాలు కూల్చి నూతనంగా పనులు ప్రారంభించాం. రూ.40లక్షల నిధులకు దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశాం. నిధులు రాక పనులు మధ్యలోనే ఆగిపోయాయి. తెచ్చిన మెటీరియల్ మొత్తం నేలపాలవుతుంది. చేసిన పనులకు నిధులిస్తే పనులు పూర్తి చేస్తాం. **- టి.దస్తయ్య, కాంట్రాక్టర్, బార్వాద్**

చెత్తాచెదారం తొలగించాలి

నవాబుపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చంచల్‌పేట్ నుంచి చిట్టిగడ్డ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో మూసీనదిపై గత సంవత్సరం బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో బ్రిడ్జి కింద చెత్తాచెదారం పేరుకపోవడంతో నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సోమవారం బ్రిడ్జిని పరిశీలించారు. చెత్తాచెదారం తొలగించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అక్నాపూర్ మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి నింపడమే లక్ష్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తమ కళాశాల, పాఠశాలలో చదివే విద్యార్థుల్లో దేశభక్తి, సమాజసేవ నింపడమే లక్ష్యమని నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, దివ్యానగర్‌లోని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగు కళాశాలలో సోమవారం 2(7)ఎన్‌సీసీ కేడెట్ల బెటాలియన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరంలో 750 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్నల్ ఎంఎస్ కుమార్, భూషణ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

దోమ: గుండాల గ్రామంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు తప్పడం లేదని కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల రాంచంద్రారెడ్డి అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా 24 గంటల విద్యుత్ లైన్‌కు సంబంధించిన పనులను వెంటనే చేపట్టాలని ఎస్‌ఈకి వినతి పత్రం అందజేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

శామీర్‌పేట: నూతనంగా ఏర్పాటైన అలియాబాద్ మున్సిపాలిటీకి తొలి కమిషనర్‌గా నియామకమైన చంద్రశేఖర్‌ను సోమవారం స్థానికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హృదయ్‌కుమార్, వివేకానంద, నర్సింహ, రవీందర్, బొమ్మ శ్రీహరి పాల్గొన్నారు.

పశువుల సంతలో విక్రయాలు బంద్

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న పశువుల సంతలో ఈ నెల 8వ తేదీ వరకు ఎలాంటి పశువుల క్రయ విక్రయాలు జరపవద్దని మార్కెట్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బక్రీద్‌కు సౌకర్యాలు కల్పించండి

తాండూరు: బక్రీద్ పండుగను పురస్కరించుకొని సౌకర్యాలు కల్పించాలని ఎంఐఎం పార్టీ నాయకులు, ఈద్గా, గ్రేవ్ యార్డు కమిటీ సభ్యులు సోమవారం మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం అధ్యక్షులు అబ్దుల్ హది షహరి పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎస్‌ఐలకు సన్మానం

కులకచర్ల: మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎస్ రమేశ్‌ను సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ పందిరి పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని వెంకన్నకుంటకు చెందిన దస్తగిరి(24) అదే ప్రాంతానికి చెందిన సాయినిఖిల్‌తో కలిసి నగరంలోని బోయిన్‌పల్లి కూరగాయాల మార్కెట్‌కు అశోక్‌లేలాండ్ వాహనంలో కూరగాయాలు తరలిస్తుంటారు. గతనెల 30రాత్రి బోయిన్‌పల్లి మార్కెట్‌లో కూరగాయలు అన్‌లోడ్ చేసి అర్ధరాత్రి దాటాక ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, శివారెడ్డిగూడ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వాహనం ఆపారు. అదే సమయంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి దస్తగిరిని బెదిరించి రూ.4వేలు లాక్కొని, పేటీఎం ద్వారా రూ.5వేలు పంపించుకొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఆదివారం రాత్రి ఘట్‌కేసర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఘట్‌కేసర్‌కు చెందిన జవహర్, పత్తిరాజు, బంగారు శ్రావణ్‌లుగా గుర్తించి విచారించగా దారిదోపిడీ పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురు నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రౌడీషీటర్‌కు రూ.25వేల జరిమానా

ఘట్‌కేసర్ రూరల్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): బైండోవర్ ఉత్తర్వులను ఉల్లంఘించిన రౌడీషీటర్‌కు రెండో తగరతి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, స్థానిక తహసీల్దార్ సోమవారం రూ.25వేల జరిమానా విధించారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన కుండ్ల మధుగౌడ్‌పై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఏడు కేసులు నమోదు కావడంతో 2010లో రౌడీషీటర్ ఓపెన్ చేశారు. మధుగౌడ్ తిగిరి నేరాలు చేయడంతో అతడిపై నాలుగు కేసులు నమోదయ్యాయి. 2024 నవంబర్ 16న తహసీల్దారు ముందు హాజరుపరచగా ఒక సంవత్సరం పాటు మంచి ప్రవర్తనతో ఉండాలని ఆదేశించారు. కానీ 2024 డిసెంబర్ 18న తిరిగి అతడిపై క్రిమినల్ కేసు నమోదైంది. దీంతో మెజిస్ట్రేట్ ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు సోమవారం తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. ఈ మేరకు రూ.25వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఆరుగురిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టుచేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, ఎల్ఐజీ కాలనీ సమీపంలోని బయ్యన్నగుట్ల వద్ద నిర్మానుష్యప్రదేశంలో పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడకు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, ప్లేకార్డులు, రూ 9170 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నవాబుపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి గుర్తించారు. నవాబుపేట మండలంలోని ఎల్లకొండ గ్రామానికి చెందిన శివ ఇటీవలే ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఫోన్ ఆచూకీ గుర్తించి సోమవారం బాధితుడికి ఎస్ఐ అరుణ్‌కుమార్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు.